
# ముసురు

పాలగిరి విశ్వప్రసాద్



**మూడు రోజుల నుండి తెరపిలేకుండా కురుస్తోందీ వాన. బంగాళాఖాతంలో ఎక్కడో వాయుగుండం ఏర్పడిందట.**

**గుట్టల మీద నిర్మాణంలో ఉన్న థర్మల్‌స్టేషన్ - ఎక్కడి పనులక్కడ నిలిచిపోయి నిర్జీవంగా ఉంది. ప్రతిరోజూ కనిపిస్తున్న హడావుడీ, అలికిడీ ఏ మాత్రం లేదు.**

**బయట వాన ఉధృతి అంతకంతకూ ఎక్కువవుతోందీ రోజు.**

వానతో పోటీ పడుతూ, లోపల పేకాట జోరుగా సాగుతోంది. పందెం కోడిని గిరిలోకి విడిచేవానికి, వెనుక మడమ తొక్కేవాడున్నట్లు - ఆడే వాళ్ళకన్నా మరింత ఆసక్తిగా చూస్తూ, ఆటగాళ్ళ వీపుల కూర్చున్న వాళ్ళు సలహాలిస్తున్నారు.

ఈ మూడు రోజులనుండీ ఇంకా పూర్తికాని థర్మల్ గెస్ట్‌హౌస్‌లోనే మకాం. గెస్ట్‌హౌస్ ద్వారాలకు, కిటికీలకు యింకా వాకిళ్ళు బిగించలేదు. మిగిలిన బిల్డింగ్ పనంతా దాదాపు పూర్తయింది. ఇప్పుడిప్పుడు కడుతున్న కాంక్రీట్ బిల్డింగ్...వానకు తడిసిన సిమెంటు, మట్టి వాసనలతో యింపుగా ఉంది. అయినా గదిలో క్రమంగా ఎక్కువవుతోన్న సిగరెట్ల పొగవాసన దాన్ని చంపేస్తోంది.

'డ్రాప్' చేసి బయటికి పోయిన చంద్రం నవ్వుతూ విసురుగా లోపలికి రావడం - ఆ వెనుకే ఎర్రటి బురద మట్టి వచ్చి గదిలో నేలమీద పడి చిట్లి మా అందరి మీద బొట్లు బొట్లుగా చిమ్మడం - అంతా ఒకేసారి జరిగిపోయింది.

వెంకటసుబ్బయ్య చివ్వున అరిచినాడు -"ఏందిరా చంద్రం? మళ్ళా ఆ ఎర్రిదాన్ని ఏందో గిల్లినట్లున్నవ్? ఇప్పుడు చూడు, అది చేసిన పనికి రూమంతా గబ్బుపట్టింది." - లేచి బట్టలు విదిలించుకొన్నాడు.

రవీంద్రారెడ్డి సిగరెట్ ఆర్పుతూ - "ఏంది చంద్రం? ఎప్పుడూ ఆ పిచ్చిదాన్ని ఏదో ఒకటి చేసి ఏడ్పిస్తుంటావ్, అదేం ఆనందం నీకు?" అన్నాడు.

వాళ్ళ మాటలకు చంద్రం ఏమీ చెప్పకుండానే, తనంతట తాను నవ్వుకుంటూ "కానీయండి...పంచండి - పంచండి!" అంటూ ఆట దగ్గర కూర్చున్నాడు.

ఈ చంద్రం వలన ఆటలో గాంభీర్యత లేకుండా పోతోంది. దానికి తోడు శంకర్‌గాడూ, కుమార్‌గాడూ ఏదో ఒక ట్రైంలో మాటా మాటా పెంచుకుంటున్నారు. వాళ్ళదెప్పుడూ పిల్లీ, ఎలుకా సావాసం. మా అందరి కన్నా కొంచెం వయసెక్కువున్న వెంకటసుబ్బయ్య తరుచూ వీళ్ళందర్నీ అదుపు చేస్తుంటాడు.

ఇక్కడున్న వాళ్ళందరం ఈ చుట్టుపక్కల ఊళ్ళ వాళ్ళమే. థర్మల్ స్టేషన్ కడుతున్న ఈ గుట్టలకింది ప్రాంతంలో ఉన్నాయి మా పల్లెలన్నీ. దాదాపు వీళ్ళలో అందరూ ఇక్కడ ఏదో చిన్న చిన్న సబ్‌కాంట్రాక్ట్ వర్క్‌లు చేసుకుంటున్న కాంట్రాక్టర్సే. అందరం ఈ ప్రాంతం వాళ్లమే కాబట్టి మా మధ్య ఉన్న చనువును బట్టీ - బీరకాయ పీచు బాంధవ్యాలను బట్టీ - ఇతరేతర సంబంధాలను బట్టీ...వరుసలు బట్టి బావా అనో, మావా అనో, ఒరేయ్ అనో, ఓయ్ అనో పిలుచుకుంటుంటాం. ఇంచుమించు అందరం ముప్పైకి రెండేళ్ళు అటూఇటూ వున్న వాళ్ళమే.

కుమార్, శంకర్‌ల గిల్లికజ్జాలతో - వాళ్ళను ఉసిగొల్పుతున్న చంద్రంతో మెల్లగా ఆట క్రమశిక్షణ కోల్పోతోంది. సీరియస్‌నెస్ లేని ఆటలో నాకు కూర్చోవాలనిపించడం లేదు. నా నిరాసక్తతకు తోడు ఆటలో ముక్కలు కూడా కలసి రావడం లేదు.

వెంకటసుబ్బయ్య డీల్‌షో చూపించినాడు...నా ఆట ఔట్. లేచొచ్చి వసారాలో పిట్టగోడ మీద కూర్చొని వానను చూస్తున్నాను.

వసారాలోనే ఒక మూల పిచ్చిది ముడుచుకొని కూర్చొనుంది. దాని బట్టలూ, తల తడిసి నీళ్ళోడుతున్నాయి. చంద్రం ఏదో ఒకటి చేసి ఈ పిచ్చిదాన్ని వానలో తడిపుంటాడు. చలికి సన్నగా వణుకుతోంది.

థర్మల్ స్టేషన్ నిర్మాణం మొదలైన ఈ మూడేళ్ళ నుండీ, ఈ పిచ్చిది థర్మల్ ఆవరణలోనే కనిపిస్తూ వుంది. ఇరవైయైదు, ముప్పై యేళ్ళుంటాయేమో! అప్పుడప్పుడూ కొంచెం శుచిగా కన్పిస్తూంటుంది - కాబట్టి తెలివితేటలు పూర్తిగా శూన్యమయినంత పిచ్చి లేదేమోనని నా అంచనా. ఆ పిచ్చిదాన్ని గురించి వివరాలేవీ నాకు తెలియదు. తెలుసుకోవాలన్నంత ఆసక్తీ, అవసరమేం లేవు - నాకు.

వాన పడేటప్పుడు ఈ సబ్‌కాంట్రాక్టర్లంతా ప్లాంట్‌లో ఎక్కడ మకాం వేస్తే అక్కడ తచ్చాడుతుంటుంది...ముఖ్యంగా చంద్రం ఉన్న చోట.

మిగిలిన రోజుల్లో ఎవరి పనుల్లో వాళ్ళుండి 'వర్క్స్' దగ్గరుంటారు కాబట్టి ఈ పిచ్చిదాన్ని ఊసు ఎవరికీ కాబట్టదు. ఇది కూడా 'ఆడనో-ఈడనో' వర్కర్స్ దగ్గర యింత పెట్టించుకొని తింటూ గడుపుతుంది. లేదా మొండుగా చంద్రం ఎక్కడ వర్క్ చేయిస్తూంటే అక్కడ తచ్చాడుతుంది. ప్రాజెక్టు పని ప్రారంభమయినప్పటి నుండీ చంద్రం ఇక్కడ చిన్న చిన్న కాంట్రాక్టులు చేస్తున్నాడు. ఈ మూడేళ్ళకే అప్పుల స్థాయినధిగమించి మూడునాలుగు లక్షలు వెనకేసినట్లు చెప్పుకుంటుంటారు....ఇప్పుడు స్థానిక ఎమ్మెల్యే పంచన చేరి మరింత పైకి పోవడానికి మార్గాలు వేసుకుంటున్నాడు. ప్రాజెక్టు పూర్తయేనాటికి - రాబోయే రెండు



మూడేళ్ళలో ఇంకెంత సంపాదిస్తాడో!

ఈ పిచ్చిదాని లాంటి వాళ్ళకు అప్పుడప్పుడూ ఉదారంగా హోటల్ నుండి అన్నం తెప్పించి పెడుతుంటాడు. అందరితోనూ కలివిడిగా ఉంటూ ఎంతో ఆత్మీయమైన స్నేహాన్ని కనబరుస్తుంటాడు. అందరి దగ్గరా ఖర్చు విషయంలో జాలీగానే ఉంటాడు. అందరూ ఆ మనిషిని ధర్మరాజు, భోళాశంకరుడు అంటుంటారు.

నాకు మాత్రం చంద్రం మీదెందుకో అకారణమైన అయిష్టత వుంది. మా మధ్య ఎప్పుడూ ఏమీ జరిగింది లేదు - ఎదురైనప్పుడూ అతను అభిమానంగానే పలకరిస్తుంటాడు. కానీ నా అంతరాల్లో ఆ మనిషి పట్ల అయిష్టత ఏర్పడింది - బహుశా స్వభావ విరుద్ధం వల్లనేమో!

లోకంలోని ఇన్ని రకాల మనుషుల దగ్గిరా ఒకేరకంగా ఆత్మీయతను ఒలకబోయగలగడం చాలా మంది దృష్టిలో గొప్పతనంగా గుర్తింపబడొచ్చు. నాకు మాత్రం అతని అలాంటి స్నేహ స్వభావం పట్ల అనుమానమే! అది స్వచ్ఛమైనదేనా అని?

పిచ్చిదానిలాంటి వాళ్ళకు అతడు తెప్పించే అన్నం కూడా జాలితో తెప్పిస్తున్నట్లు నాకనిపించదు. సంపాదిస్తున్నాను కాబట్టి ఖర్చుపెడుతున్నాననే నిర్లక్ష్యం - అలవోకతనం కన్పిస్తాయి. ఆ అలవోకతనం వెనుక కనపడని అహం కూడా ఎంతోకొంత ఉందేమో!

"ఏది ఏమైతేనేం లే, అతని అహం - నిర్లక్ష్యం అతని దగ్గరే ఉంటాయి....ఈపిచ్చిదానికింత కూడు పుడుతోంది" - అనే తృప్తి వల్ల చంద్రం పట్ల నాకున్న అయిష్టత స్థానంలో శత్రుభావం ఏర్పడలేదు.

ఇక్కడ మేజర్ కాంట్రాక్ట్స్ తీసుకున్న కన్‌స్ట్రక్షన్ కంపెనీల్లో - ఒక దాంట్లో రోజువారీ యాభైరూపాయల జీతానికి టెంపరరీగా సూపర్వైజర్ పన్జేస్తున్న చిల్లుల బతుకు నాది. నాలాంటి వాళ్ళకున్న జాలిని ఈ పిచ్చిదేం చేసుకుంటుంది? కూడు పెట్టలేని ఒఠ్ఠిజాలి ఏం సాధిస్తుంది? ఎవర్ని ఉద్ధరిస్తుంది? జాలీ, ఆత్మీయతలున్నా లేకపోయినా, చంద్రం వంటివాళ్ళు చేసే అలవోకపు ఖర్చు వల్ల ఎవరో ఒకరి కడుపులైనా నిండుతాయి.

పిచ్చిదాని మీద నుండి చూపులు తిప్పుకొని, వానను చూస్తూ కూర్చున్నాను. ఈ యేడు వానలు ఎక్కువయి వేరుశనగ - కాయ ఊరక నీరు బుడ్డయిపోయింది. ఈ శెనకట్టె పీక్కుంటే పశువులకు మేతన్నా దక్కుతుంది. ఇప్పుడీ అకాల వర్షం దాన్ని కూడా కుళ్ళ బెడుతోంది. ఈ రాయలసీమ రైతుల బతుకు లెప్పుడూ యింతే. ప్రతి సంవత్సరం విత్తనం వేయను కూడా సరైన పదును వాన పడదు. వేసిన విత్తనం సగం మంట్లోనే కలిసిపోతుంది. ఐదారేండ్లకొకసారి వాన కురిసిందనుకొన్న సంవత్సరం, సంబరపడి - ఈ రైతు దరిద్రుడు తలకఢగను పోతే వడగండ్ల వాన ఈడ్చి కొడుతోంది. ఈ అకాలపు అధిక వర్షపు నీటిని అదుపుచేసి, అదునుకు రైతుకు అందించే చిత్తశుద్ధి వున్న ప్రభుత్వాలూ, పాలకులూ లేరు. అదే జరిగుంటే ఐదెకరాల భూమి ఉన్న నాలాంటి వాళ్ళు ఈ ఫ్యాక్టరీల వెంబడీ ఈ అరకొర కూలి ఉద్యోగాలకు దేబిరించడం....తీరిక సమయాల్లో చేయడానికి ఏ పనీ, అవకాశమూ లేక పేక ఆడుకోవడం.....ఇవన్నీ మా బతుకుల్లో కెందుకొస్తాయి?

ఒంటరిగా కూర్చున్న నాలో ఆలోచనలు ఒకదాని వెంట ఒకటి సుడులు తిరుగుతున్నాయి. ఏవీ సంపూర్ణం కావు. నిర్దిష్టమైనవి అంతకన్నా కావు. మధ్యలోనే మొదలయి మధ్యలోనే తెగిపోతున్నాయి.

బిలబిలమంటూ లోపల్నుండి చంద్రం, రవీంద్రారెడ్డి, శంకర్, కుమార్‌లు వసారాలోకొచ్చినారు. వెంకటసుబ్బయ్య లోపలనే మరో బ్యాచ్‌లో కూర్చున్నట్లుంది.

"ఏం బావా! ఒక్కనివీ బయట కూర్చున్నావా?" అన్నాడు శంకర్ నా పక్కనే గోడ మీద కూర్చుంటూ. నేను పలకలేదు. నా సమాధానం కోసం అతనూ ఆశించలేదు. ఏదో యదాలాపంగా అడిగాడంతే. అడిగిన వెంటనే అవతలి వాళ్ళతో మాటల్లో పడ్డాడు. అందరూ పిట్టగోడ మీద కూర్చొని, జరిగిపోయిన పేకాటలో ఎవరేం పొరబాట్లు చేసినారో - ఏం చేసింటే బాగుండునో - ఏ ముక్క కలిసుంటే తాము ఆట కొట్టేవాళ్ళో....కలగాపులగంగా నెమరేసుకుంటున్నారు.

కుమార్ చేయిచాచి బయటి వాన నీటిని చేత్తో పట్టి, మూలనున్న పిచ్చిదాని మీదికి విసిరనాడు. అది ఉలిక్కిపడి, వెంటనే కుమార్‌ను కాల్చేదాని మాదిరి చూసింది. అతను నవ్వుతూ "ఏయ్ ఎర్రీ! ఇట్రాయే" అన్నాడు. అది మరింత గుర్రుగా చూసి తలకాయ పక్కకు తిప్పుకొంది.

చంద్రం సిగరెట్ ముట్టించుకొంటూ "ఒరే కుమార్‌గా! నీకు మనుషుల్ని గౌరవించడం కూడా తెల్దురా. అట్ల పిలిస్తే ఎట్లరా?" అగ్గిపుల్ల ఆర్పి, దమ్ముపీకి - "వెంకటలిచ్చిమీ! ఇట్రామ్మా!" అన్నాడు అనునయంగా.

ఆ వెంకటలక్ష్మి మరింత తీక్షణంగా చంద్రంను చూసి చూపులు తిప్పుకొంది.

"ఇదో, ఈ మద్దేనం అన్న మెద్దూ?" చంద్రం పాచిక వేసినాడు.

పారినట్లే ఉంది.

పిచ్చిదాని చూపుల్లో ఇంతకు ముందున్న తీక్షణత లేదు. మామూలుగా చూసింది. కదుల్దామా వద్దా అన్న సంశయంలో ఉంది. వెంకటలక్ష్మి పిచ్చిదే కానీ అనుభవాల్ని మరిచిపోయేటంతటి కాదు. వాళ్ళు చెప్పేవన్నీ అంత ధారాళంగా తన చేతికి రావని, దానికెన్ని సార్లు అనుభవమో! అందుకే సంశయిస్తోన్నట్లుంది...దిక్కులు చూస్తోంది.

"ఒరేయ్, బమ్మం!" చంద్రం పిలుపు కోసమే కాచుకోనున్నట్లు, లోపల్నుండి ఒక్క ఉదుటున వచ్చి పడినాడు - బ్రహ్మం "ఏం న్నా!" అంటూ.

బ్రహ్మంకు నిండా ఇరవయేళ్ళు కూడా లేవు. ఏదో అట్టడుగు జాతికి చెందినోడనుకుంటాను. వాళ్ళ వాళ్ళు ఇతన్ని చచ్చాడా, బతికాడా అనైనా అనుకుంటారో లేదో! రేయింబవళ్ళు ఈ థర్మల్ ఆవరణలోనే ఉంటాడు. అయితే ఏ కాంట్రాక్టర్ దగ్గిరా ఒళ్ళువొంచి పనిచేసుకుందామనుకోడు. చంద్రం లాంటి వాళ్లకు పైపై పనులు చేస్తూ పొట్టపోసుకుంటుంటాడు.

చంద్రం నూర్రూపాయల నోటు తీసిచ్చినాడు - "రేయ్! హోటల్‌కు పోయి రాపో!" ఎలాగూ మధ్యాహ్నం కావచ్చింది కదాని అందరూ బ్రహ్మంకు డబ్బిచ్చి భోజనాలకు పురమాయించినారు. లోపల ఆటలో వున్న వాళ్ళ దగ్గర కూడా వసూలు చేసుకున్నాడు.

నన్నడిగితే నాకు వద్దన్నాను. ఇంటికి పోవాలన్నాను.

"ఈ వానకు ఎట్ల పోతావ్?" చంద్రం అడిగిన దానికి నేనేం సమాధానం చెప్పలేదు. వానను చూస్తూ ఉండిపోయినా - నేను ఏమీ చెప్పనందుకు నొచ్చుకున్నాడేమో తెలియదు.

"రేయ్, బమ్మం! ఈ పొద్దు వెంకటలచ్చిమికి బిరియానీ పెడదాం రా!" అన్నాడు.

"నువు బిర్యానీలు పెట్టబడ్తే, అదేడ మాట యింటాదన్నా?" అన్నాడా బ్రహ్మం.

లోపల్నుండి పెద్ద క్యారియరూ, ప్లాస్టిక్ బుట్టా తీసుకొని దాటిపోతూ, పిచ్చిదాన్ని చూసి "ఏమదృష్టమే నీది!" అన్నాడు.

పోతున్న బ్రహ్మం నుద్దేశించి "నువు అక్కడే తిని, మూడు కట్టించుకొనిరా! ఓబులేసు హోటల్‌కు పో - బిర్యాని బాగుంటుంది." అంటూ అరిచినాడు.

మొలకెత్తిన ఆశ తీరుతోందనే నమ్మకం కలగగానే, పిచ్చిది లేచి రెండడుగులు ముందుకేసి చంద్రం ఎదురుగా నిలబడింది.

"జోతి లిచ్చిమి డాన్స్ చెయ్యే!" అన్నాడు కుమార్.

కుమార్ మాటనది లెక్కజేయలేదు. ఉమ్మా, చెమ్మా-అనక నిలబడింది.

"నువు చెప్తే చేస్తాందేంట్బీ?" అని "దగ్గరికి రా వెంకటలచ్చిమీ!" దగ్గరికొచ్చిన వెంకట లక్ష్మి జడలు కట్టిన వెంట్రుకలను వుల్లతో వెనక్కు సవరిస్తూ "డాన్స్ చేయ్" అన్నాడు చంద్రం.

అప్పటికీ కదలిక లేకపోయే సరికి "ఒరేయ్ ! వాన్ని అన్నం తేవద్దని చెప్పు" అన్నాడు ఎవర్నో ఉద్దేశించినట్లు - రోడ్డు మీదికి పారజూస్తూ.

అంతే! నోటికాడ ముద్ద జారిపోయినంత ఆత్రంగా, పిచ్చిది కుచ్చిళ్ళు బొడ్లో దోపుకొని పిచ్చి గంతులేసింది.

"తీ, ఇది జోతిలచ్చిమి డాన్స్ కాదు. జోతిలచ్చిమికి చీరుండదు." అన్నాడు చంద్రం.

ఆ పిచ్చిది ఎగుర్తానే పైట జారిడిచింది. రొమ్ములు ఊగేటట్లు భుజాలను ముందుకూ, వెనక్కూ కదిలిస్తూ ఏదో తిప్పలు పడింది.

పిచ్చిదానికి వేళకు తిండి దొరుకుతుందో, లేదో!...ఉండన నీడైనా ఉందో లేదో!...ఇవేవీ దాని వయసు పొంకానికి

అడ్డు రాలేదు. చౌట భూమిలో కూడా ఎక్కొచ్చిన గచ్చారంద కంప చెట్టు మాదిరి ఏపుగానే పెరిగింది.

"తీ, సరిగా ఊపలే" అన్నాడు కుమార్.

ఎగుర్తూనే కుమార్ వంక కోపంగా చూసింది.

కొంతసేపటి తర్వాత భుజాలు ఊపడం చాలించి, ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తూ - అడుగుకనుగుణంగా కొంచెం కొంచెంగా చీరను పెకెత్తుతోంది.

లయబద్ధమైన దాని ఒక్కొక్క అడుగుతర్వాత, కుమార్ "వ్వా! - వ్వా!" అంటూ ఊతం పలుకుతున్నాడు.


కొంచెం కొంచెంగా చీరను మోకాళ్ళ పై వరకూ తెచ్చి, అక్కడ విదిలించి కిందికిడిచింది.

ఇవన్నీ ఆ పిచ్చిది ఎక్కడ నేర్చిందో!

కుమార్ దాని రొమ్ముల మీద చెయ్యేయబోయినాడు.... విదిలించి కొట్టింది.

"దానికి పిచ్చంటారు. చూడు, రొమ్ముల మీవ చేయిపడనియ్యదు" అన్నాడు రవీంద్రారెడ్డి.

శంకర్ తన అసహజ ధోరణిలో - "పిచ్చికైనా, పశువుకైనా ఈ సృష్టి రహస్యాలు పుట్టుక తోనే తెలిసుంటాయి నాయనా!" అన్నాడు. అతని శుష్కవచనాల పట్ల ఎవరూ ప్రతిస్పందించలేదు.



పిచ్చిదాని నాట్యభంగిమలను
చూస్తూ చంద్రం అడిగినాడు "ఒరే
య్! కుమార్! ఆడదైతే సరి, కుక్క
నైనా విడిచిపెట్టవు నువ్వు.
ఒకసారి దీన్ని కూడా పట్టి చూడా
ల్సిందిరా!"
కుమార్ అసహ్యంగా మొహం
పెట్టి "పోన్నా, బాగా చెపుతవ్?
ప్లాంటులో కావల్సినన్నిండయ్.
నా వర్క్ దగ్గర్నే సుగాలి తండాలో
ముద్దరుండారు. 'పిచ్చ' అనుకో.
రాంట్లనే చూసుకోడానికే పొద్దు
చాలడంలే. ఈ ఎర్రిలంజకు
పోను నాకేమన్నా ఖర్మా? అయినా
చిల్లర నాకొడుకు బమ్మంగాడూ
పోయి- నేనూ పోతే నా విలువే
ముంటాది?" అన్నాడు.
ఏట్లెట్లరా, మన బమ్మం గాడు
నికి పోతండాడా?" చంద్రం అమాయకమైన ఆశ్చర్యాన్ని
లిబుచ్చినాడు.
ళ్ళ చేష్టల మీదా, సంభాషణ మీదా ఎంత
నాసక్తంగా ఉన్నా, నా కళ్ళూ - చెవులూ వాటిని దాటలేక
తున్నాయి. మెదడ్లో ముద్రలు పడుతున్నాయి. నేను వెకి
భరించలేనంత సున్నితం కాదుగానీ - ఈ రోజెందుకో
సహనమెక్కువవుతోంది. అయినా చొరవ తీసుకొని అడ్డు
ప్పలేకపోతున్నాను. అడ్డు చెప్పినా వాళ్ళు వినరని
సు. అనవసరంగా గొడవపడి స్పర్థలు పెంచుకోవాలి.
చోట పన్జేసుకుంటున్న వాళ్ళం....ఎందుకొచ్చిన గొడవ!
నా వాహనం దొరికితే ఇంటికి పోదామన్పిస్తోంది.
హనం దొరకకపోయినా, వానైనా తగ్గితే పోవచ్చు. ఇక్క
నుండి కాలినడక దారిపడితే మా వూరు రెండు కిలో
టర్లు.
తగ్గే సూచనలు కనిపించడం లేదు...సన్నటి జల్లు
స్తానే ఉంది.
హ్మాం అన్నం పొట్లాలూ, క్యారియరూ తీసుకొచ్చే సరికి,

పిచ్చిది ఎగరడం ఆపింది.

బ్రహ్మాం అవన్నీ లోపల పెట్టి వొచ్చినాడు.

చంద్రం, బ్రహ్మాంను పిలిచి రహస్యమడిగినట్లు - "దీన్ని మచ్చిక చేసినావంటగదరా?" అన్నాడు.

"ఉత్తది లేన్నా?" బ్రహ్మాం సిగ్గునభినయించినాడు. అయినా నిజాల్ని దాచిపెట్టలేదు.

"అదేడ రానిస్తాందన్నా? దగ్గరికి పోతానే చేతల్తో కాళ్ళతో తంతుంది."

"తంతే నువు వూరకుంటావేందా?" - చంద్రం ఆసక్తి.

"ఊరకేంటికుంటా? నేనూ తన్ని, గుద్ది దావకు తెచ్చుకుంట" బ్రహ్మాం చెప్పుకోవడంలో గర్వం వుంది.

పిచ్చిది, బ్రహ్మాంతో మాట్లాడుతోన్న చంద్రంను చేతిమీద తట్టి పిలిచింది. చంద్రం దాని పక్క చూస్తూనే 'అన్నం పెట్ట'మని సైగలు చేస్తూ అర్థం కాని భాష మాట్లాడింది.

" మా బమ్మం గానికి ముద్దు పెట్టు, అన్నం పెడ్తా" అన్నాడు.

పిచ్చిది బ్రహ్మాంను కోపంగా చూసింది. బ్రహ్మాం నవ్వుతున్నాడు.

పిచ్చిది కాలెత్తి బ్రహ్మాంకు చూపి, పిచ్చి పిచ్చిగా అరిచింది. అందరూ నవ్వుతున్నారు.

"పోనీ డాన్స్ చెయ్" తనూ నవ్వాపుకుంటూ అన్నాడు చంద్రం.

గంతులేయబోయింది.

"ఇక్కడ కాదు - వానలో జోతిలచ్చిమి డాన్స్ చేసేది వానలోనే"

పిచ్చిది వాన దిక్కు భయంగా చూసింది...ఇప్పటికే చంద్రం పాలబడి ఉదయం నుండీ ఎన్ని సార్లు తడిసిందో! దాని ఒళ్ళు కూడా ఆరోగ్యంగా ఉన్నట్లు లేదు...వానను చూస్తే చాలు భయపడుతోంది. మూలకు పోయి కూర్చోబోయింది.

కుమార్ దాన్ని బలవంతంగా జబ్బ పట్టి లేపినాడు.

కుమార్, బ్రహ్మాం కలిసి దాన్ని వానలోకి తోసినారు.

అది విసురుగా పోయి, తేమకు నిలదొక్కుకోలక జారి దబ్బున పడింది. కుమార్ వెంటనే పగలబడి నవ్వుతూ లేచి వచ్చి వసారాలో నిలబడినాడు.

వానలో పడి, లేచి కూర్చున్న పిచ్చిదాని కళ్ళలో నీళ్ళొచ్చినట్టున్నాయ్.

చంద్రం నవ్వుతూ "ఒరే కుమార్‌గా! నువు మరీ లేకి పనులు చెయ్యొద్దురా?" అన్నాడు.

తను మాట్లాడేటప్పుడూ, చేసేటప్పుడూ అతని కేమనిపిస్తుందో!...ఎదుటివాళ్ళు చేసేటప్పుడు లేకి పనులూ, వెకిలి మాటలూ వద్దని మందలించి తను పెద్ద మనిషి స్థాయిని కనబరుస్తాడు.

పిచ్చిది కళ్ళు తుడుచుకొంటూ లేచి వసారాలోకి రాబోయింది. బ్రహ్మాం దాన్ని మళ్ళీ వర్షంలోకి తోసినాడు.

అది కోపంతో రెచ్చిపోయి, వంగి ఎర్రమట్టి బురదను తీసి విసిరింది. వసారా ద్వారం దగ్గరున్న కుమార్, బ్రహ్మాం, రవీంద్రారెడ్డి- ఒక్కసారిగా పక్కకు జరిగి బురద తగలకుండా జాగ్రత్తపడ్డారు. బురద గచ్చుమీద పడి వసారా అంతా చిట్లింది.

నాకు, ఈ రోజు ఇక్కడకు రాకున్నా బాగుండుననిపించింది.

"గబ్బుముండా! వసారంతా గబ్బు పట్టిస్తావే?" అంటూ కుమార్ దాని మీదికి మళ్ళీ పోబోయినాడు. అది మళ్ళీ బురద తీసుకుంది.

కుమార్ అటూ, యిటూ చూసి-సెంట్రింగ్ వర్క్‌తో కత్తిరించబడిన ఇనుప చువ్వ ఒకటి కనిపిస్తే తీసుకున్నాడు.

"ఏయ్, ఆ బురద బేయ్, నీ పయి చిట్లుతాది"

ఆ మాటతో పిచ్చిది ఠక్కున బురద కిందేసింది. దాని మొహం చూస్తే దెబ్బలంటే చచ్చేంత భయమున్నట్లు కనిపించింది.....వీళ్ళతో ఎన్నిసార్లు తిన్న అనుభవమో!...చేతికి ఏది దొరికుంటే దాంతో కొట్టి బెదిరించినట్లున్నారు.

వానలో తడుస్తూ వస్తొన్న కుమార్‌నూ, కుమార్ చేతిలోని ఇనుపచువ్వనూ చూసి ప్రాణ భయంతో కంపించినట్లు విసురుగా లేచి, రోడ్డవతలి చెట్టుకిందికి పరిగెత్తింది.

"కుమార్! నువు దాన్ని కొట్టి భయపెట్టొద్దు" చంద్రం హెచ్చరికతో కుమార్ వెనక్కి తిరిగొచ్చినాడు.

ఆరుబయట వానలో తడవడం కన్నా, చెట్టు మీద నుండి ఏకధాటిగా కారుతోన్న నీటిబొట్ల తాకిడి మరింత దుర్భరంగా వుండేమో!...రెండు పిడికిళ్ళూ బిగించి, రొమ్ముల మీద ఆన్చుకుని గడగడా వణుకుతోంది.

పిచ్చిది చెట్టుకిందికి పోయాక దాని ప్రసక్తి నుండి బయట పడి లోకాభి రామాయణంలో పడ్డారు. వాళ్ళ పిచ్చాపాటిలో కలవాలని ఎంత ప్రయత్నించినా కలవలేకపోతున్నాను. మధ్య మధ్య వాళ్ళే ఎవరో ఒకరు నన్ను మాటల్లో కలుపుతున్నారు. అయినా నేను 'ఆ'-'ఊ'లకు మించి మాట్లాడలేక పోతున్నా.

అంతకు ముందు వీళ్ళ వల్ల మనసులో ఏర్పడిన ముసురు ఎంతకూ వీగిపోవడం లేదు. ఆ ముసురట్లా కప్పుకొని వుంటే, నిర్మలంగా మాట్లాడటానికి చేతకావడం లేదు.

“టయమయింది. ఆ తెచ్చిన అన్నం నీలుక్కపోకముందే తిందాం పాండి” అన్నారెవరో.

చంద్రం, రోడ్డవతల చెట్టుకిందున్న పిచ్చిదాన్నుద్దేశించి “ఏయ్, ఎర్రీ! నీకు కూడొద్దూ?” అని అరిచినాడు.

పిచ్చిది అయోమయంగా చూసింది. మధ్యాహ్న భోజనాలకు సిద్ధమవుతున్నారని నిర్ధారించుకున్నాక, మెల్లగా చెట్టును విడిచి వచ్చింది.

దగ్గరికొచ్చిన పిచ్చిదాన్ని “తినవా?” అని చేత్తో సైగ చేసి అడిగినాడు.

అది తలకాయూపింది.

“మరి, వానలో డాన్స్ చేయమంటే చేయకపోతివే?”

ఆ ప్రశ్నతో, ‘అన్నం పెట్టరేమో’ననే భయం దాని మొహంలో వెదజిమ్మింది. అందరి వంకా పిచ్చి చూపులు చూసింది.

“చెప్పిన మాట విననందుకు గుంజీలు తీస్తావా?”

చంద్రం నోటి నుండి ప్రశ్న వచ్చీ రావడంతోనే, పిచ్చిది రెండు చేతుల్తో చెవుల్ని పట్టుకొని గుంజీలు తీస్తోంది.

“అన్నం పరబ్రహ్మ స్వరూపం తంద్రీ! జీవమున్న జీవి ఏదైనా- పిచ్చైనా, మంచైనా, పశువైనా ఆ పరబ్రహ్మ స్వరూపం కోసం ఆరాట పడక తప్పదు. ఈ పోరాటమూ తప్పదు” - శంకర్ తన ధోరణిలో అతని మాటలేవో వాగినాడు.

నాకు వాళ్ళ మాటల పట్ల నిరాసక్తంగా ఉంది. వాళ్ళ చేష్టల మీద అసహనం పెరిగి పోతోంది.

వానలోనే ఇంటి దారి పడదామా అనే ఊగిసలాటలో ఎటూ తేల్చుకోలేక పోతున్నాను.

“రేయ్, బ్రహ్మం! ఒక బిరియాని పొట్లం తేపోరా” అనగానే, బ్రహ్మం లోపలికి పోయి పొట్లం తెచ్చి చంద్రంకిచ్చినాడు.

“లోపలికి రాయే” అనగానే, ఆదరా బాదరా పిట్టగోడ తిరిగి వసారాలో కొచ్చింది.

ఏ పరీక్షలకు గురి కాకుండానే పొట్లం దాని చేతి కొచ్చింది...నాకు ఆశ్చర్యమే!

తీసుకొని మూలకు పోబోయింది.

“ఏయ్! ఈడ్నే కూర్చో!” అన్నాడు చంద్రం.

అది సంశయించ లేదు...క్షణమాలశ్యం చేయలేదు.

పిట్టగోడ మింద కూర్చున్న చంద్రం దగ్గరే కింద కూలబడింది. ఆత్రంమాత్రంగా పొట్లం విప్పింది. ముద్ద చేతికి తీసుకోబోతుంటే, కుమార్ వంగి దాని చేయి పట్టుకున్నాడు.

“ముందు అన్న కాళ్ళకు మొక్కకో. అన్నం పెట్టినోనికి మొక్కద్దూ?” అన్నాడు.

ఎదురుగా ఉన్న అన్నం నోట్లోకి పోవడానికి జరుగుతున్న ఆలస్యం ఒక్క క్షణమైనా అది భరించేటట్లు లేదు. కుమార్ చేతిని విదిలించి కొట్టి ముద్ద నోటికి బొక్కింది.

కుమార్ విస్తరిని దూరంగా గుంజినాడు...పిచ్చిది విస్తరి వెంబడే ముందుకు జరిగింది...ఇంకో ముద్ద తీసుకోబోయింది...కుమార్ అందనివ్వలేదు, విస్తరిని మరింత దూరం గుంజుకున్నాడు...పిచ్చిది కూడాజరిగి తీసుకోబోయింది...అందనివ్వలేదు...అయోమయంగా చంద్రం దిక్కు చూసింది.

చంద్రం, కుమార్‌ను మందలించి తనకు ముద్ద దక్కేటట్లు చేస్తాడనేమో...దాని జాలి చూపులు.

చంద్రం ఏమీ అనకుండానే నవ్వుతున్నాడు. అతనికి కూడా ఆ పిచ్చిదాన్తో కాళ్ళకు మొక్కించుకోవాలనుందేమో!

“అన్న కాళ్ళకు మొక్కేంత వరకూ నీకు కూడు దక్కదు” అంటూ కుమార్ విస్తరిని చేతినుండి విడిచిపెట్టలేదు.

కుమార్ చెప్పినట్లు చేస్తే, తర్వాత అన్నం తినొచ్చు అనే స్థిమితం దానికి లేదు...తనకు అందకుండా పోతున్న విస్తరి గురించే దాని ఆందోళనంతా. నోటికాడి కూడును ఏ గద్దలో తన్నుకు పోతున్నట్లు బేలగా, బెదురుగా అందరి వంకా చూస్తోంది...అంతలోనే ఎవరి సహాయం కోసం వేచి ఉండలేనట్లు విస్తరి వైపు జరుగుతోంది. కుమార్ దాన్ని అందనివ్వడం లేదు.

విస్తరి జరుగుతూ ఉంటే...పిచ్చిది జోగాడుతుంటే ... వసారాను ఒక చుట్టి చుట్టినారు.

“కుమార్! దాన్ని తిననియ్” అన్నాను. నా మాటలో ఏదో కటువూ, బెదిరింపూ పలికింది. అంతకు ముందు నుండీ నాలో గూడు కట్టుకున్న అసహనమే దానికి కారణం కావచ్చు.

కుమార్ నన్ను నిర్లక్ష్యంగా చూసి, తన పనిలో పడినాడు. అతని నిర్లక్ష్యాన్ని భరించలేకపోయాను. పిచ్చిదాని మీది జాలికి తోడు నన్ను లక్ష్యపెట్టలేదనే ఉక్రోషం జతకూడింది.

“ఏయ్, చెప్పేది నీక్కాదూ? దాన్ని విడిచి పెడ్తావా లేదా?” ఈ సారి కటువుగా అనాలనే అన్నాను.

వంగి వున్న వాడు లేవకుండానే, తల తిప్పి నన్ను తీక్షణంగా చూసి “ఇది నీకు సంబంధం లేని విషయం” అన్నాడు.

అంతే! అంతవరకూ మసలుతున్న లావా తన్నుకొచ్చింది.

> **ఆరుబయట వానలో తడవడం కన్నా, చెట్టు మీద నుండి ఏకధాటిగా కారుతోన్న నీటిబొట్ల తాకిడి మరింత దుర్భరంగా వుందేమో!...రెండు పిడికిళ్ళూ బిగించి, రొమ్ముల మీద ఆన్చుకుని గడగడా వణుకుతోంది.**
> **పిచ్చిది చెట్టుకిందికి పోయాక దాని ప్రసక్తి నుండి బయటపడి లోకాభి రామాయణంలో పడ్డారు. వాళ్ళ పిచ్చాపాటిలో కలవాలని ఎంత ప్రయత్నించినా కలవలేకపోతున్నాను.**

లేచి పోయి, కుమార్ మెడ మీది కాలర్ పట్టీ పట్టుకొని పైకి, విసురుగా బయటికి తోసినా...వాడు పోయి వానలో పడ్డాడు.

పడినంత విసురుగా లేచి, అమ్మనూ అక్కనూ తిడుతూ రాబోయినాడు.

నేను అటూ ఇటూ చూసి అంతకు ముందు కుమార్‌గాడు పిచ్చిదాని మీదికి తీసుకున్న ఇనుప చువ్వను చిక్కించుకొని “రారా, నా కొడకా! ఈడ్నే నిల చెక్కుతా!” అంటూ ఊగిపోయినా.

చంద్రం ఒక్క ఉదుటున మా మధ్య కొచ్చినాడు.

ఒక చేత్తో కుమార్‌ను అడ్డుకొని, నాతో అన్నాడు-“ఏంది రాజా! ఆ పిచ్చిదాని కోసం నువు కలబడడమేంది? ఎవరన్నా వింటే నవ్వుతారు. దాని తమాషాగా ఏడ్పిస్తున్నాం- కడుపు నిండా తిండి పెడ్తన్నాం. పోనీ ఏడ్పించొద్దంటే, దానికి తిండి కూడా పెట్టం. దానికి కడుపెట్ల నిండుతుందో చెప్పు? నీ ఉక్రోషానికి అర్థం పర్థం లేదు.” అన్నాడు.

వాడు చెప్పేదాంట్లో ఎంత అసమంజసమూ, అమానుషమూ ఉన్నాయో నాకు తెలుసు...కానీ నాకు వాదించడం చేతగాదు. వాదన చేతకాకపోతే సత్యమూ, న్యాయమూ కూడా అసత్యమూ, అన్యాయమూ అయి కూర్చుంటాయి. అవతలివాడి వాదనా బలం వల్ల అసత్యమూ, అన్యాయమూ కూడా సత్యము, న్యాయం గా చెలామణీ అవుతాయి. వాడితో వాదించేంత స్థిమితం కూడా లేదు... నా నరాలు ఆవేశంతో చిట్లి పోతున్నాయి.

“అసలు నీతోనే రా వచ్చింది. సూత్రధారివి నువ్వే. నువు రా ముందు!” అంటూ అరిచినా.

చంద్రం విస్తుపోయినాడు...తేరుకున్నాడు. అయినా నిగ్రహం కోల్పోలేదు.

నా అరుపులకు లోపలున్న వాళ్ళు, ఆట చాలించి వచ్చినారు.

చంద్రం తనంతకు తాను అనుకున్నట్లు తాపీగా అన్నాడు-“నీకేదో క్రాక్ లేచింది. ఇప్పుడేం మాట్లాడకూడదు లే!” కుమార్ నా మీదకు రాకుండా చంద్రమే అడ్డం నిలబడి వున్నాడు. నేను ఆవేశంతో వూగిపోతూ నిలబడ్డాను.

“మా బావకు, ఎవర్తో కొట్లాడాల?-ఎవరి కోసం కొట్లాడాలనే ఇంగితమే లేదు. అదే వుంటే ఈ మనిషి ఈ రొచ్చులో ఎందుకుంటాడు?” అంటున్నాడు శంకర్, రవీంద్రారెడ్డితో.

కుమార్ ఏందో వాగుతూనే ఉన్నాడు “అది నీకేం చుట్టమా? చెల్లెలా? అంటూ ఇంకేమో అంటున్నాడు.

బయటకొచ్చిన వెంకటసుబ్బయ్య కుమార్‌ను చూపుడు వేలుతో బెదిరిస్తూ “రేయ్! నువు నోర్మూసుకుంటావా? నేనొచ్చి మెట్టుతో కొట్టాల్నా?” అన్నాడు.

కుమార్ ఇంక నోరెత్తలేదు.

నిప్పు రాజుకున్నంత హఠాత్తుగా చల్లారి పోయింది. నేను వానలో పూర్తిగా తడిసి పోయినా.

అందరి మనసుల్లో అంతకు ముందు లేని వెలితి ఏదో పొడసూపింది. చానాసేపు మౌనమే రాజ్యమేలింది.

పిచ్చిది ఏమీ కాబట్టనట్టు విస్తరి తీసుకొని పోయి, బిల్డింగ్ పక్కగా కిటికీ కింద కూర్చొని ఆవురావుమంటూ తింటోంది.

వాతావరణాన్ని తేలిక పర్చడానికి ఎవరో ఒకరు ఏదో ప్రశ్న అప్పుడప్పుడు వేస్తున్నారు.

కొంతసేపటికి తర్వాత చంద్రం నన్నుద్దేశిస్తూ పిలిచినాడు- “అన్నం తిందాం రా!” అని.

శత్రుభావం పొడసూపిన తర్వాత,ఏమీ జరగనట్లు నిర్మలంగా మాట్లాడటం నాకు చేతగాదు...నేను పలుక లేదు.

“నీ కోసమనే బిర్యానీలు రెండు తెప్పించింది. తిందాం రా!” అన్నాడు.

“దయ చేసి నన్ను బలవంతం చెయ్యొద్దు. నాకు ఆకలి కాలేదు”

ఏమనుకున్నాడో, చంద్రం మరి బలవంతం చేయలేదు. తనూ తినడానికి పోలేదు. పిట్టగోడ మీదనే కూర్చున్నాడు.

అందరూ అన్నం తినడానికి రూంలోకి పోయినారు.

పిచ్చిది తినడం ముగించి, కిటికీ మీదున్న సన్‌షేడ్ నండి కారే నీళ్ళు తాగుతోంది.

దాని ఆకలి కోసం ఎవరో కొట్లాడినారనీ...గొడవ జరిగిం నీ...దానికే మాత్రం స్పృహ లేదు.

చంద్రం ఎందుకో దాన్ని పిలిచినాడు.

“ ఏయ్, ఎర్రీ! ఇట్రాయే!”

అది వచ్చింది. అంతకు ముందు ఏడ్పించిందంతా మర్చిపోయినట్లు వచ్చింది.

ఔను, రాక తప్పదు...శంకర్‌గాడు చెప్పినట్లు పిచ్చైనా, మంచైనా, పశువైనా అన్నం కోసం ఆరాటమూ, పోరాటమూ పడక తప్పదు... ఆ పరబ్రహ్మ స్వరూపాన్ని చేరడానికే యిన్ని పాట్లూ!...మరి ఆ పరబ్రహ్మ స్వరూపం చం గుప్పిట్లో ఉంది. ..పిచ్చిదెక్కడికి పోతుంది, చంద్ర గుప్పి ట్లోకి పోక?

నాలో ఏదో ముసురు అలుముకుంటోంది...దట్టంగా-అ మ్యగోచరంగా!

తొందరగా గూడు చేరుకోవాలని ఉంది...ఈ ముసురు టట్లు లేదు. అంతకంతకూ అలుముకుంటోంది.